అసెంబ్లీలో బీఆర్ఎస్ ధూంధాం

- ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ దూకుడు
- సమిష్టిగా, సమర్థంగా సర్కారును నిలదీసిన గులాబీదళం
- కాంగ్రెస్ తప్పులు, తప్పుడు లెక్కలపై సభలో ప్రస్తావన
- బడ్జెట్ సమావేశాల చివరిరోజు సభలో కేటీఆర్ విశ్వరూపం
- సమాధానాలు చెప్పలేక ఇరకాటంలో పడ్డ కాంగ్రెస్ పార్టీ

శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీగా పదవీ కాలం పూర్తయిన సత్యవతిరాథోడ్, సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న కేటీఆర్, హరీశ్, కవిత, మధుసూదనాచారి, ప్రకాశ్, దేశపతి, రమణ, నవీన్‌కుమార్, తాతా మధు, ఎంసీ కోటిరెడ్డి, తక్కెళ్లపల్లి, శంభీపూర్ రాజు, రావుల, దాసోజు తదితరులు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ధూంధాం ప్రదర్శించింది. ప్రతీ సందర్భంలో, ప్రతీరోజు అధికార కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ పైచేయి సాధించిందని రాజకీయవర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ డొల్లతనాన్ని నిండుసభలో సమర్థంగా ఎండగట్టిందని విశ్లేషకులు చెప్తున్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, పద్దులపై జరిగిన చర్చలో, చివరకు ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడే సందర్భం వరకు బీఆర్ఎస్ సభ్యులు లోతైన అధ్యయనంతో, సమగ్రమైన వివరాలతో సర్కారు వైఖరిని తూర్పారపట్టారని పలువురు ప్రజాసంఘాల నాయకులు అభినందిస్తున్నారు. కాంగ్రెస్ 15 నెలల పాలన వైఫల్యాలను సమర్థంగా, సమిష్టిగా గులాబీ నేతలు ఎండగట్టారని చెప్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై కాంగ్రెస్ చెప్తున్న లెక్కలు తప్పని వివరిస్తూ.. గణాంకాలతో బయటపెట్టారు. ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, వడ్లకు బోనస్, మహాలక్ష్మి తదితర హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టడంలో బీఆర్ఎస్ విజయం సాధించిందని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఓ దశలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెదిరింపులకు దిగినా, మంత్రులు దబాయించినా వెరవకుండా దీటైనా సమాధానాలతో సర్కారును ఇరుకున పెట్టడంపై అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

జగదీశ్‌రెడ్డిపై వేటుతో మొదలైన జగడం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే స్పీకర్‌నుద్దేశించి వ్యక్తిగతంగా మాట్లాడారంటూ మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని స్పీకర్ సమావేశాలు పూర్తయ్యేవరకు సస్పెండ్ చేశారు. స్పీకర్‌ను బహువచనంతో సంబోధించినప్పటికీ, ఏకవచనంతో సంబోధించారంటూ ప్రభుత్వం అభియోగాలు మోపింది.

ప్రశ్నలను ఎదుర్కోలేని ప్రభుత్వం!

సభప్రారంభమైన మొదటిరోజు ప్రధాన ప్రతిపక్ష సభ్యులు సర్కారుపై ప్రశ్నాస్త్రాలు సంధించారు. కానీ సమాధానాలు చెప్పుకోలేక మంత్రులు నీళ్లు నమిలారంటూ రాజకీయవర్గాలు, సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో మరుసటి రోజు నుంచే క్వశ్చన్ అవర్‌ను రద్దుచేశారు. అలాగే జీరో అవర్‌లోనూ అధికారపక్ష సభ్యులకు మాత్రమే మాట్లాడే అవకాశమిచ్చి చేతులు దులుపుకున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

అప్పులు.. అబద్ధాలను తిప్పికొట్టిన సభ్యులు

గవర్నర్ ప్రసంగంలో అప్పులు, ఆరు గ్యారెంటీల అమలుపై చెప్పిన లెక్కల్లో తప్పులు ఉన్నాయంటూ బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అప్పులు కేవలం రూ.4.17 లక్షల కోట్లేనని గణంకాలతో వివరించారు. పదే పదే మంత్రులు పాయింట్ ఆఫ్ ఆర్డర్లు అంటూ లేచి అవాంతరం కలిగించినా, అసందర్భంగా చేసిన అనుచిత విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టారు. బీసీ బిల్లులోని లోపాలను ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కేపీ వివేకానంద సమర్థంగా వివరించారని బీఆర్ఎస్ అభిమానుల్లో హర్షం వ్యక్తమయింది. ఫోర్త్‌సిటీకి భూసేకరణ పేరిట దారుణాలు, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వ వైఫలమైందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారపక్షాన్ని నిలదీశారు. రుణమాఫీపై కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని నిప్పులుచెరిగారు.

ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నలు.. కోమటిరెడ్డి చిందులు!

ఆర్‌అండ్‌బీ శాఖ పద్దుపై జరిగిన చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహంగా స్పందించిన తీరు అసెంబ్లీలో ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్ పాలనలో రోడ్లకు రిపేర్లు మాత్రమే చేశారని, కొత్త రోడ్లు నిర్మించలేదంటూ కోమటిరెడ్డి అన్నారు. వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ప్రశాంత్‌రెడ్డి ఘాటుగా ప్రతిస్పందించారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన రహదారులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను లెక్కలు సహా వివరించారు.

పద్దులపై 'పల్లా' మాటల తూటాలు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రైతు సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. వర్షాకాలంలో వీసీల నియామకంపై ప్రభుత్వం చెప్పిన సమాచారంలో తప్పిదాలను తిప్పికొట్టారు. గ్రామీణాభివృద్ధిపై సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో చేసిన పనులను ప్రస్తావించారు. కాంగ్రెస్ సభ్యులతో పాటు స్పీకర్ అడ్డుతగలడంపై బీఆర్ఎస్ నిరసన తెలిపింది. ఎస్సీ వర్గీకరణలోని లోపాలను సరిదిద్దాలని మాణిక్‌రావు కోరారు. దళితబంధు లబ్ధిదారులకు రెండో విడుత నిధులు విడుదల చేయాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైద్య రంగంపై సంజయ్ ప్రసంగానికి మిగిలిన పార్టీల సభ్యులు కూడా అభినందించారు. ఇలా బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్‌ను ఎండగట్టడంలో సఫలీకృతమైందని గులాబీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తున్నది.

రేవంత్ దూషణలు..తిప్పికొట్టిన కేటీఆర్

బడ్జెట్ సమావేశాల చివరిరోజున సభలో వాడీవేడి చర్చ జరిగింది. ద్రవ్య వినిమయ బిల్లుపై కేటీఆర్, రేవంత్ మధ్య మాటల యుద్ధం నడిచింది. రేవంత్ వ్యక్తిగత దూషణలకు దిగగా, కేటీఆర్ అంతే ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. రేవంత్ బెదిరింపులకు భయపడేది లేదంటూ బదులిచ్చారు. ఏం చేస్తావో చేస్కో, ఏం చేసినా ఫరక్ పడదంటూ నవాలు విసరడంతో బీఆర్ఎస్ సభ్యుల హర్షాతిరేకాలతో సభ హోరెత్తింది. ఏ ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ తేల్చిచెప్పారు. దీనికి అధికారపక్షం నుంచి స్పందన కరువైంది. సీఎం రేవంత్, మంత్రి భట్టి అప్పుల లెక్కలను హరీశ్‌రావు కాగ్ రిపోర్ట్‌ను చూపుతూ నిలదీశారు. దీంతో ముఖ్యమంత్రి, మంత్రి నుంచి భిన్నమైన సమాధానాలు రావడంతో అంతా ఆశ్చర్యపోయారు. ఇలా ప్రజాక్షేత్రంలోనే కాదు సభలోనూ ప్రజల గొంతుకను వినిపించడంలో బీఆర్ఎస్ విజయవంతమైనట్టు అభిమానుల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

లోకం పోకడ

హే, బచ్చా.. కరెంటు కనిపెట్టింది మేము.. మా ఆనవాళ్లు కూడా లేకుండా చేద్దామనే?!

ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించండి

కేంద్రమంత్రి కుమారస్వామికి ఎంపీ వద్దిరాజు వినతి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డీ కుమారస్వామితో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ వద్ద ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ పరిశ్రమ కొన్నేండ్లుగా మూతపడిందని, దీంతో కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలో కార్మిక నాయకులతో కూడిన ప్రతినిధి బృందం ఏప్రిల్ 2న ఢిల్లీ రానున్నదని, వారు కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తెలిపారు.

సీఎం వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ కుమార్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పందిస్తూ 'ఉప ఎన్నికలు రావు' అని పేర్కొనడంపై శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నప్పటికీ న్యాయవ్యవస్థను బెదిరించేలా సీఎం మాట్లాడారని పేర్కొన్నారు. రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యంపై రేవంత్ వ్యాఖ్యలు దాడి చేయడమేనని తెలిపారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన సీఎం.. శాసనసభలో న్యాయమూర్తిలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

కవితపై ఆరోపణలు నిరాధారం

- బల్మూరి వెంకట్ వ్యాఖ్యలను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ చేసిన ఆరోపణలు నిరాధారమని పలువురు బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఏమీ లేదని, రాజకీయ కక్షతో కేసులు పెట్టారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెబుతుంటే.. తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం ఆమెపై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని బీసీ సంఘం నాయకుడు బొల్ల శివశంకర్ విమర్శించారు. ఉద్యమ సమయంలో ఆమె ఊరూరు తిరుగుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను, బతుకమ్మను కాపాడితే.. బల్మూర్ గోడలు దూకుతున్నారని బీఆర్ఎస్ నేత ఎల్చాల దత్తాత్రేయ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి మోచేతి నీళ్లు తాగుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకురాలిపై, రాష్ట్రం కోసం పాటుపడుతున్న వారి కుటుంబంపై ఏది పడితే అది మాట్లాడటం మంచిది కాదని హెచ్చరించారు.

బల్మూరి.. నోరు జాగ్రత్త!: శ్రీకాంత్‌గౌడ్

ఎమ్మెల్సీ కవితపై అవాకులు, చెవాకులు పేలుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నోరు జాగ్రత్త అని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి తొనుపునూరి శ్రీకాంత్‌గౌడ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని ఇచ్చిన కాంగ్రెస్‌పై పోరాడి అసెంబ్లీలో బిల్లుపెట్టేలా కవిత కృషి చేశారని కొనియాడారు.

బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలి

- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం

హైదరాబాద్, మార్చి28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు గవర్నర్ ఆమోదం పొందిన వెంటనే అమలులోకి తేవాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బిల్లులు గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. ఇది కేవలం చట్టపరమైన అంశంకాకుండా, బీసీల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యగా పేర్కొన్నారు. బీసీల హామీలను అమలు చేయకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

ఓబీసీశాఖ ఏర్పాటు చేయాలి

- బీసీ నాయకుడు ధనుంజయ డిమాండ్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో 58 మంత్రిత్వశాఖలతో పాటు, 93 విభాగాలు ఉన్నాయని చెప్పారు. కానీ ఓబీసీల సంక్షేమం, అభివృద్ధిని చూసేందుకు ప్రత్యేక విభాగంలేదని తెలిపారు. జనాభాలో 56 శాతమున్న బీసీలకు ప్రత్యేకశాఖ ఏర్పాటు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

తెలంగాణ భవన్‌లో బీఆర్టీయూ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాంబాబుయాదవ్, రూప్‌సింగ్, నారాయణ, మారయ్య, భారతి, సునీత, దానకర్ణాచారి, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు

హక్కుల సాధనకు ఐక్య ఉద్యమం

- కార్మిక పోరాటాలకు బీఆర్ఎస్ అండ
- కేసీఆర్ పాలనలోనే సముచిత న్యాయం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): కార్మికులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. తొలుత ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరణించిన కార్మికులకు ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ పోరాటాలతోపాటు ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని సూచించారు. కేసీఆర్ పాలనలోనే కార్మికులకు, ఉద్యోగులకు సముచిత న్యాయం జరిగిందని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా నాడు కార్మికులకు అనేక హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి.. సీఎం అయ్యాక హామీలపై చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. కార్మికుల పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు రూపసింగ్, నాయకులు నారాయణ, మారయ్య, దానకర్ణాచారి, నగేశ్‌యాదవ్, సంతోష, భారతి, కాశిరెడ్డి, సునీత, బాబాయమ్మ, నర్సింహులు, ప్రభాకర్, తిరుపతి, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్టీయూ సమావేశ తీర్మానాలు

- ఉపాధికూలీలకు 150 రోజుల పనిదినాలు, రోజూ రూ.350 చొప్పున వేతనం ఇవ్వాలి.
- గ్రామ పంచాయతీ సిబ్బందికి కనీస వేతనం అమలుచేయాలి.
- ఎన్నికల హామీ మేరకు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలి
- ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలి.
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులకు రెండు పీఆర్సీలను అమలు చేయాలి
- ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల చొప్పున చెల్లించాలి.
- బీడీ కార్మికులకు పింఛన్ వర్తింపునకు 2014 కటాఫ్ తేదీని ఎత్తివేయాలి.
- గిగ్ వర్కర్స్‌కు బీమా సౌకర్యం కల్పించాలి.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

- జనాభా ఆధారంగా పార్లమెంట్ స్థానాల పెంపు సమాఖ్య స్ఫూర్తికి విఘాతం
- ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): దేశంలోని పార్టీలు బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారు, మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల పెంపు దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని ఆందోళన వ్యక్తంచేశారు. దశాబ్దాల నుంచి దక్షిణాదిపై కేంద్రం వివక్ష కొనసాగిస్తున్నదని, ప్రస్తుత డీలిమిటేషన్ ప్రతిపాదనలతో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యంతోపాటు అన్ని రంగాల్లో దక్షిణాదికి అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. బెంగళూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రగతిశీల విధానాల ద్వారా జనాభా పెరుగుదలను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరుగుతున్నదని, జనాభా ఆధారంగా మాత్రమే డీలిమిటేషన్ చేయడానికి తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా న్యాయంగా ఉంటూనే లోక్‌సభ సీట్లను 543 నుంచి 888కి పెంచాలని సూచించారు. సమావేశంలో కర్ణాటక బీసీ కమిషన్ మాజీ చైర్మన్ సీఎస్ ద్వారకాంత్, కర్ణాటక ఓబీసీ కమిషన్ వైస్ చైర్మన్ భాస్కర్, సౌత్ ఇండియా బీసీ నాయకుడు రోహిత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలు కాంగ్రెసోళ్లు చేస్తరు!

- మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, మార్చి 28 : కబ్జాలు కాంగ్రెసోళ్లు చేస్తరని, తాము చేయమని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి తెలిపారు. భూకబ్జా కేసులో విషయంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి శుక్రవారం మోకిలా పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యా రు. శంకర్‌పల్లి మండలం టంగుటూరు, చేవెళ్ల మండలం ఈర్లపల్లిలో భూవివాదానికి సంబంధించి జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై మోకిలా, చేవెళ్ల పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులకు సంబంధించి ఇప్పటికే హైకోర్టులో వాదనలు ముగియగా... జడ్జి తీర్పు రిజర్వ్ చేశారు. జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, పోలీసుల విచారణ ఆపాలని అప్పీల్ చేసుకున్నారు. దీన్ని హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారించిన సర్వోన్నత న్యాయస్థానం అతన్ని అరెస్ట్ చేయవద్దని ఆర్డర్ ఇచ్చింది. అయితే పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశించడంతో శుక్రవారం మోకిలా పీఎస్‌కు విచారణకు వచ్చారు. సుప్రీం ఇచ్చిన ఆర్డర్‌ను పోలీసులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులకు సహకరిస్తానని చెప్పారు. తాను ఎవరి భూమి కబ్జా చేయలేదని, కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకంటే ఎక్కువ మాట్లాడనని తెలిపారు.

ఫార్ములా ఈ-రేస్‌తోనే బీవైడీకి బాటలు

- 2022-23లోనే ఆ సంస్థతో చర్చలు జరిపాం
- ఓలెక్ట్రా సంస్థతో కలిసి పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత
- నాడు అడ్డంకిగా నిలిచిన చైనాతో విదేశాంగ విధానం
- నేడు అవరోధాలు తొలిగి పెట్టుబడులు రావడం సంతోషకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన కృషి, అనుసరించిన విధానాల ఫలితంగానే ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ కంపెనీ బీవైడీ తెలంగాణకు వస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు బీవైడీ అంగీకరించిందని గుర్తుచేశారు. ఇప్పుడు భారీ పెట్టుబడితో తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు బీవైడీ సంస్థ ముందుకు రావడంపై సంతోషం వ్యక్తంచేస్తూ శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సుమారు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి తెలంగాణలో పెట్టాలని బీవైడీ సంస్థతో 2022-23లో పలు మార్లు చర్చలు జరిపామని తెలిపారు. అయితే, ఇటీవల భారత ప్రభుత్వం సరళీకృత విధానాన్ని అనుసరించడంతో ఈ పెట్టుబడి తిరిగి తెలంగాణకు రావడం హర్షణీయమని పేర్కొన్నారు.

ఫార్ములా ఈ-రేస్ ఎఫెక్ట్

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఫార్ములా-ఈ రేస్‌పై చేస్తున్న విమర్శలను కేటీఆర్ ప్రస్తావించారు. ఫార్ములా-ఈ రేస్‌ను కేవలం రేస్‌గానే చూడకూడదని, తెలంగాణ మొబిలిటీవ్యాలీ కార్యక్రమంలో భాగంగా సమగ్ర ప్రణాళికతో దీనిని నిర్వహించామని వివరించారు. దేశ ఎలక్ట్రిక్ వాహన రంగంలో తెలంగాణను కేంద్ర స్థానంగా మార్చాలనే లక్ష్యంతో అనేక అంశాలతో కూడిన, పక్కా ప్రణాళిక ప్రకారం పనిచేశామని తెలిపారు. అందులో భాగంగానే వినూత్నమైన ఈవీ పాలసీ, ఈవీ సమ్మిట్, తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు, ఫార్ములా-ఈ నిర్వహణ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామని పేర్కొన్నారు. గతంలో ఈవీ విధానాన్ని తీసుకొచ్చి, ఎలక్ట్రిక్ వాహన రంగంతోపాటు వాటి అనుబంధ రంగాల్లో కూడా పెట్టుబడులను ఆకర్షించే ఉద్దేశంతో ఫార్ములా-ఈ రేస్‌ను నిర్వహించామని, దాని ఫలితమే ఈ బీవైడీ పెట్టుబడి అని తెలియజేశారు.

కేసీఆర్ పాలనలో సౌ'భాగ్యనగరం'.. నేడు అ'భాగ్యనగరం'

పదేండ్ల కేసీఆర్ పాలనలో సౌ'భాగ్యనగరం'గా మారితే, 15 నెలల అసమర్థ కాంగ్రెస్ పాలనలో అది అ'భాగ్యనగరం'గా తయారైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో ఇండ్ల కొనుగోళ్లు బాగా తగ్గాయని దుయ్యబట్టారు. పేదల ఇండ్ల మీదకు బుల్డోజర్లను పంపి, పెద్దల ఆస్తులతో సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారని మండిపడ్డారు. మూసీ, హైడ్రా పేరుతో కాంగ్రెస్ గద్దలు మూటలు కడుతున్నారని, అమ్మకాలు జరుగక రియల్టర్లు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే, అన్నదాతల మాదిరిగానే అమాయక రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో గత త్రైమాసికంలో ఇండ్ల విక్రయాలు 49%, ఆఫీస్ లీజ్ 41 శాతానికి పడిపోయిందని వివరించారు. ఇలాంటి పరిస్థితులతో రియల్‌ఎస్టేట్ ఢమాలైందని, ఇన్‌ఫ్రా రంగం సజీవ సమాధి అయిందని విమర్శించారు. 'కూల్చడం కాదు.. కట్టడం నేర్చుకోవాలి. అబద్ధాలు చెప్పడం కాదు.. అభివృద్ధి చేయడం నేర్చుకోవాలి' అని ఎక్స్ వేదికగా హితవు పలికారు.

కేటీఆర్‌కు బ్రిడ్జ్ ఇండియా ఆహ్వానం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక సదస్సుకు హాజరుకావాలంటూ ఆహ్వానం అందింది. బ్రిటన్‌లో జరిగే 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకి రావాలంటూ బ్రిడ్జ్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈ ఏడాది మే 30న లండన్‌లోని రాయల్ లాంకాస్టర్ హోటల్లో జరిగే సదస్సుకు కేటీఆర్‌ను ముఖ్య వక్తగా ఆహ్వానిస్తూ, బ్రిడ్జ్ ఇండియా వ్యవస్థాపకుడు ప్రతీక్ దత్తాని లేఖ పంపారు. 2023లో ఇదే కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న కేటీఆర్.. ఆనాడు చేసిన ప్రసంగం, ఆలోచనలు అక్కడి వారందరినీ ఆకట్టుకున్నాయని ఈ సందర్భంగా ప్రతీక్ తెలిపారు. ఈసారి కూడా లండన్ వ్యాపారవర్గాలు, ఇండో-యూకే కారిడార్‌లోని ముఖ్య వ్యక్తులు, తెలుగు ప్రవాసులు కేటీఆర్ ప్రసంగం వినడానికి ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. దీంతో తెలంగాణలో ప్రభుత్వం మారినప్పటికీ, కేటీఆర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఈ సదస్సుకి భారత్-బ్రిటన్ వ్యాపార ప్రముఖులు, పాలసీ మేకర్లు, తెల